JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి


ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

మేడ్చల్ - మల్కాజిగిరి । బుధవారం 13-08-2025
Medchal - Malkajgiri । Wednesday 13-08-2025

jayabherinews

సంపుటి : 02 । సంచిక : 80 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 80 । Pages : 8 । ₹: 5

జయాపజయాలకు అతీతంగా కెరీర్‌లో దూసుకుపోతున్నది తెలుగమ్మాయి శ్రీలీల. ప్రస్తుతం ఆమె హిందీలో 'ఆషికీ 3' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. కార్తీక్ ఆర్యన్ ఇందులో కథానాయకుడు. ఈ సినిమాలోని శ్రీలీల పాత్ర విషయంలో బీ టౌన్‌లో ఓ రూమర్ మొదలైంది. వివరాల్లోకెళ్తే. రీసెంట్‌గా విడుదలైన 'సైయారా' చిత్రం ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఇందులో హీరోయిన్ ఆల్జిమర్ వ్యాధితో బాధపడుతుంటుంది. అక్కడ్నుంచే కథ మలుపు తిరుగుతుంది. ప్రస్తుతం శ్రీలీల నటిస్తున్న 'ఆషికీ 3' కథ కూడా దాదాపు ఈ తరహాలోనే సాగుతుందనేది ఆ రూమర్ సారాంశం. "సైయారా'కూ మా సినిమాకూ ఏ సంబంధమూ లేదు.





## ఏపీలో సెమీకండక్టర్ తయారీ యూనిట్

■ కేంద్రం మరో గుడ్ న్యూస్

జయభేరి, విజయవాడ:

సెమీకండక్టర్ తయారీని ప్రోత్సహించడానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలలో రూ. 4,594 కోట్ల పెట్టుబడితో నాలుగు కొత్త ప్రాజెక్టులను కేంద్రం ఆమోదించింది. ఇది భారతదేశ సాంకేతిక సామర్థ్యాన్ని పెంచుతుంది, ఉపాధిని సృష్టిస్తుంది. డిజిటల్ ఇండియాను బలోపేతం చేస్తుందని కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. దేశంలో సెమీకండక్టర్ తయారీని ప్రోత్సహించడానికి కేంద్ర మంత్రివర్గం ఒక పెద్ద ముందడుగు వేసింది. నాలుగు కొత్త ప్రాజెక్టులను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ తోపాటు ఒడిశా, పంజాబ్ రాష్ట్రాల్లో ఏర్పాటు చేయనుంది. ఈ పథకాలలో

...మిగతాది 2 లో



## బంగారం దిగుమతులపై అదనపు సుంకాలు ఉండవు

■ అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన

జయభేరి, న్యూ డిల్లీ, ఆగష్టు 12:

రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా భారత్ సహా ప్రపంచంలోని పలు దేశాలపై సుంకాల మోత మోగిస్తున్నారు. రష్యా చమురు కొనుగోలు కారణంతో న్యూఢిల్లీపై ఏకంగా 50 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం 25 శాతం టారిఫ్ అమల్లోకి వచ్చింది. ఆగస్టు 27 నుంచి మిగతా 25 శాతం టారిఫ్ అమలులోకి రానుంది. అయితే, ట్రంప్ నిర్ణయంతో దిగుమతి చేసుకునే బంగారు కడ్డీలపై సుంకాల పెంపు వర్తిస్తుందా? లేదా?

...మిగతాది 2 లో



## ఘనంగా తిరంగా ర్యాలీ

జయభేరి, విశాఖపట్నం:

విశాఖ సాగరతీరంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా జరిగింది. ప్రతి భారతీ యుడు జాతీయ పతాకాన్ని ఎగుర వేయడానికి ప్రోత్సహించడం ద్వారా వారిలో దేశభక్తి, జాతీయతాభావాన్ని, స్ఫూర్తిని పెంపొందించడం కోసం ఉద్దేశించిన హర్ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా... స్థానిక ఆర్కే బీచ్ రోడ్లో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఇతర విభాగాల అధికా రులు, ఇతర సంస్థల ప్రతినిధులు పాల్గొ న్నారు.ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు.

...మిగతాది 2 లో

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**రానున్న మూడు రోజులు తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో అధికార యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌తో పాటు భారీ వర్షాలు, వరద ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఆస్తి, ప్రాణ నష్టం జరక్కుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.**

జయభేరి, హైదరాబాద్ :

రానున్న 72 గంటల్లో పలు జిల్లాలతో పాటు హైదరాబాద్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ముఖ్యమంత్రి ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అప్రమత్తం చేశారు. రానున్న పరిస్థితులను ఎదుర్కొనడానికి తీసుకోవలసిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాబోయే మూడు రోజులు కీలకంగా మారినందున అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సెలవులను రద్దు చేయాలి. 24 గంటలు అందుబాటులో ఉండాలి. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరకుండా, పశు సంపదకు నష్టం జరక్కుండా చర్యలు తీసుకోవాలి. 24 గంటల్లో 2 సెం. మీ వర్షాన్ని తట్టుకునే విధంగా పట్టణాలు నిర్మితమై ఉన్నాయి. అలాంటిది క్లౌడ్ బరస్ట్ సమయాల్లో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అందరూ సన్నద్ధంగా ఉండాలి. గతంలో 2 గంటల్లో 42 సెం.మీ వర్షం పడటంతో నష్టం జరిగింది. విపత్తు నివారణ నిధులను వినియోగించుకోవాలి. నిధులకు కొరత లేదు. గ్రేటర్ హైదరాబాద్, గ్రామీణ ప్రాంతాల కోసం టోల్ ఫ్రీ హెల్ప్ లైన్స్ ఏర్పాటు చేయాలి. సమాచారం ఎప్పటికప్పుడు కమాండ్ కంట్రోల్ రూంకు చేరుకునేలా ఏర్పాట్లు చేయాలి. హైదరాబాద్‌తో పాటు వరద ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ముందస్తు

...మిగతాది 2 లో

## గులాబీ దళపతి మౌనమేలనోయి

జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 12:

తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్. మొదటి లక్ష్యం సాధించింది. స్వరాష్ట్రం సిద్ధించింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రజలు.. రాష్ట్రం సాధించిన పార్టీగా 2014లో గులాబీ పార్టీకే పట్టం కట్టారు. మరోసారి 2018లో కూడా అవకాశం ఇచ్చారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ బలమైన శక్తిగా ఎదిగింది. కానీ ఇప్పుడు పతనం దిశగా పయనిస్తోంది. గులాబీ బాస్ కేసీఆర్ వారసుల చెరోదారి.. నాయకత్వ సంక్షోభం, వ్యక్తిగత విమర్శలతో కూడిన సోషల్ మీడియా

...మిగతాది 2 లో





## ఆరోపణలను రుజువు చేయాలని సవాల్..!

■ కేంద్రమంత్రి బండి సంజయ్‌కి కేటీఆర్ లీగల్ నోటీస్

జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 12:

కేంద్రమంత్రి బండి సంజయ్‌కి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీస్ పంపించారు. ఫోన్ల ట్యాపింగ్ కేసులో అసత్యాలు మాట్లాడినందుకు నోటీస్ పంపినట్లు తెలిపారు. బండి సంజయ్ కేంద్రమంత్రిగా ఉండి బాధ్యతారహితంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక ప్రజాప్రతినిధిపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదంటూ నోటీసులలో పేర్కొన్నారు.బండి సంజయ్ తన రాజకీయ ఉనికి కోసమే అసత్యపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అసత్య ఆరోపణలు చేసినందుకు వెంటనే క్షమాపణ చెప్పాలని లీగల్ నోటీసులలో డిమాండ్ చేశారు. భవిష్యత్‌లోనూ అసత్య ఆరోపణలు చేయకుండా ఉండాలని పేర్కొన్నారు. లేదంటే క్రిమినల్ చర్యలకు కూడా బాధ్యులు కావాల్సి వస్తుందని హెచ్చరించారు.అయితే ఫోన్ ట్యాపింగ్ అంశంపై బండి సంజయ్ చేసిన ఆరోపణలను కేటీఆర్ ఆయనకు లీగల్ నోటీస్‌లు పంపకముందే తిప్పికొట్టారు. బాధ్యాతయుతమైన కేంద్రమంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్..

...మిగతాది 2 లో

## పట్టపగలే ఖజానా జ్యూయలరీస్ లో కాల్పులు బంగారం చోరీ



జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 12:

హైదరాబాద్‌లోని చందానగర్‌లో ఖజానా జ్యువెలర్స్ షోరూంలో దోపిడీ కలకలం రేపింది. ముసుగు ధరించిన దుండగులు సిబ్బందిపై కాల్పులు జరిపి.. వెండి నగలు దోచుకెళ్లారు. కాల్పుల్లో షోరూం డిప్యూటీ మేనేజర్ తీవ్రంగా గాయపడ్డారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.హైదరాబాద్ చందానగర్‌లో ఉన్న ఖజానా జ్యువెలర్స్ షోరూంలో కాల్పులు కలకలం రేపాయి. ఇవాళ ఉదయం జ్యువెలర్స్ సిబ్బందిపై దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ముసుగు ధరించిన ఆరుగురు దుండగులు షాప్ తెరిచిన వెంటనే లోపలికి చొరబడ్డారు. దోపిడీని అడ్డుకోవడానికి ప్రయత్నించిన డిప్యూటీ మేనేజర్ కాళ్లపై రెండు రౌండ్లు కాల్పులు జరిపి గాయపరిచారు. సిబ్బందిపై కాల్పులు జరపడమే కాకుండా, షాపులోని సీసీ కెమెరాలపై కూడా

...మిగతాది 2 లో

## కేవలం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే కాదు.. అంతకుమించి




***ఆగస్ట్ 15న ఆంధ్రప్రదేశ్‌లో స్వాతంత్ర్య దినోత్సవంతో పాటు 'స్త్రీశక్తి' పథకం ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని మహిళలు పల్లెవెలుగు నుంచి మెట్రో ఎక్స్‌ప్రెస్ వరకు ఐదు రకాల ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భద్రత, పరిశుభ్రత, సదుపాయాల మెరుగుదల, రద్దీ నియంత్రణపై సీఎం చంద్రబాబు అధికారులను దిశానిర్దేశం చేశారు.***

జయభేరి, విజయవాడ, ఆగస్టు 12:

ఆగస్ట్ 15 ఏపీలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలతో పాటు మరో వేడుకకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. అదే రాష్ట్రంలోని మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించనున్నస్త్రీ శక్తి పథకం అమలు కార్యక్రమం. ఇందుకోసం భద్రత, సదుపాయాలు, రద్దీ నియంత్రణ.. అన్నీ సిద్ధంగా ఉంచాలని సీఎం చంద్రబాబు మంగళవారం సచివాలయంలో అధికారులను ఆదేశించారు. 'స్త్రీశక్తి' పథకం అమలులో ఎక్కడా లోపం ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు.
కేవలం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే కాదు.. బస్టాండ్స్, బస్సుల్లో సదుపాయాలకు సంబంధించి సీఎం అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. బస్ స్టేషన్లలో టాయిలెట్లు ప్రతి రెండు

...మిగతాది 2 లో

## తగ్గుతున్న ధరలు.. సామాన్యులకు శుభవార్త




***సామాన్యులకు అదిరిపోయే శుభవార్త. గత కొంత కాలంగా భారత్‌లో ద్రవ్యోల్బణం తగ్గుతూ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా ఏకంగా 8 ఏళ్ల కనిష్టానికి పడిపోవడం విశేషం. జులై నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 1.55 శాతంగా నమోదైంది. 2017 తర్వాత ఇదే అత్యల్పం.***

జయభేరి, న్యూ డిల్లీ, ఆగష్టు 12:

ఏ దేశ ఆర్థిక వ్యవస్థలో అయినా ద్రవ్యోల్బణం కీలకం అని చెప్పొచ్చు. ద్రవ్యోల్బణం అంటే పెరుగుతున్న ధరల్ని సూచిస్తుంది. ఇది ఎక్కువగా ఉంటే.. ఆర్థిక వ్యవస్థ అంతా బాగాలేదని చెప్పొచ్చు. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంటే ఆర్థిక మాంద్యం ఏర్పడే ప్రమాదాలు కూడా పొంచి ఉంటాయి. అయితే.. భారత్‌లో చాలా కాలంగా రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుతూ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఇప్పుడు సామాన్యులకు ముఖ్యంగా వంటింటి బడ్జెట్ గురించి ఎక్కువగా ఆలోచించే వారికి శుభవార్త. జులై నెలలో వినియోగదారుల ధరల సూచీ (CPI) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం

...మిగతాది 2 లో



2 లో

## భారతం.. చాణుక్య వ్యూహం

▶▶ మొదటిపేజీ తరువాయి

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చర్యలు తీసుకోవాలి. నగరంలోని మూడు కమిషనరేట్ల పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు సివిల్ పోలీసుల సేవలను వినియోగించుకోవాలి. పాఠశాలలు, కాలేజీలు నడపాలా, సెలవు ప్రకటించాలా అన్నది స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలి. హైదరాబాద్, రంగారెడ్డి లాంటి ప్రాంతాల్లో ఐటీ సంస్థలు వర్క్ ఫ్రమ్ హోం నిర్వహించుకునేలా ఆయా సంస్థలతో ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సమన్వయం చేయాలి. వీలైనంత వరకు ప్రజలను రోడ్లపైకి రాకుండా అప్రమత్తం చేయాలి. హైడ్రా తరపున ఎఫ్ఎం రేడియోల ద్వారా, టీవీల ద్వారా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి. ప్రజలను ఆందోళనకు గురిచేసే సమాచారం ఇచ్చే సంస్థలకు వెనువెంటనే వాస్తవాలను వెల్లడించాలి. భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు సంభవించినప్పుడు ఎయిర్ లిఫ్టింగ్ చేసేందుకు అవసరమైన హెలికాప్టర్స్ ఉండేలా చూసుకోవాలి. NDRF సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి. హైడ్రా 24 గంటలపాటు అప్రమత్తంగా ఉండాలి. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగంలో 2 వేల మందికి శిక్షణ ఇచ్చాం. సహాయక చర్యల కోసం ఎక్కడ అవసరమైతే వారిని అక్కడికి తరలించాలి. విద్యుత్ అంతరాయం ఏర్పడితే తక్షణం పునరుద్ధరణ పనులు చేపట్టాలి. మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్స్, అవసరమైతే జనరేటర్స్‌ను సమకూర్చాలి. విద్యుత్‌కు సంబంధించి అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునేందుకు వీలుగా మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్స్ అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా, అలాగే పట్టణాల్లో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అత్యవసర సమయాల్లో అవసరమైన మెడిసిన్స్, సౌకర్యాలను అన్నింటినీ సిద్ధం చేసుకోవాలి. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో మూసీ పరివాహక ప్రాంతంతో పాటు ప్రమాద స్థాయికి నీరు చేరుకునే ప్రాంతాలకు ప్రజలను వెళ్లనీయకుండా పోలీసులు నియంత్రించాలి. ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లోపై నీటి పారుదల శాఖ అధికారులు పూర్తి అవగాహనతో ఉండాలి. లోతట్టు ప్రాంతాల ప్రజలకు నీటి విడుదలపై పూర్తి సమాచారం ఇవ్వాలి. చెరువులు, కుంటలు కట్టలు తెగే ప్రమాదం ఉన్నందున ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుత పరిస్థితులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యేకంగా ఒక గ్రూప్ ను క్రియేట్ చేసుకుని సమన్వయం చేసుకోవాలి. అవసరమైతే కొందరు సీనియర్ ఆఫీసర్లను డిప్యూట్ చేసుకోవాలి.

## అంతకుమించి

గంటలకు శుభ్రం చేయాలన్నారు. తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు తప్పనిసరి అని సూచించారు. రూ.30 కోట్లతో జరుగుతున్న మరమ్మతులు, పెయింటింగ్ పనులు డిసెంబర్‌లోపు పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు. అవసరమైన చోట్ల కొత్త ఫ్యాన్లు, చైర్లు ఏర్పాటు చేయాలని, 24 గంటలు ఆర్టీసీ సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్.. ఇలా మొత్తం ఐదు రకాల బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుంది. జీరో ఫేర్ టిక్కెట్ల కోసం సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ఆగస్ట్ 14 నాటికి పూర్తి అవుతుందని అధికారులు తెలిపారు. ఈ పథకాన్ని సీఎం ఆగస్ట్ 15 మధ్యాహ్నం విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో ప్రారంభిస్తారు.

## ఏపీలో సెమీకండక్టర్ తయారీ..

మొత్తం రూ.4,594 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. గతంలో ప్రభుత్వం ఆరు సెమీకండక్టర్ ప్రాజెక్టులను ఆమోదించిందని, ఇప్పుడు మరో నాలుగు ప్రాజెక్టులను చేర్చడంతో ఈ సంఖ్య 10కి చేరుకుందని ఆయన అన్నారు. చిప్ తయారీలో భారతదేశాన్ని స్వావలంబన చేసే దిశలో ఈ దశ ముఖ్యమైనదిగా పరిగణిస్తున్నారు. సెమీకండక్టర్ రంగంలో ఈ పెట్టుబడి సాంకేతిక సామర్థ్యాలను పెంచడమే కాకుండా డిజిటల్ ఇండియా దార్శనికతను కూడా బలోపేతం చేస్తుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. ఈ ప్రాజెక్టుల కింద ఆధునిక ఉత్పత్తి యూనిట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇది ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, రక్షణ వంటి రంగాలలో దేశం విదేశీ దేశాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. కేంద్ర కేబినెట్ సమావేశంలో, సెమీకండక్టర్ రంగంపై మాత్రమే కాకుండా ఇతర ముఖ్యమైన రంగాలపై కూడా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో మూడు ప్రధాన నిర్ణయాలు తీసుకున్నారు. మొదట, నాలుగు కొత్త సెమీకండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. రెండవది, లక్నో మెట్రో రైల్ ఫేజ్ 1బికి గ్రీన్ సిగ్నల్ లభించింది. ఇది నగర ట్రాఫిక్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తుంది. మూడవది, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించడానికి టాటో II జలవిద్యుత్ ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. ఈ మూడు నిర్ణయాలు దేశ మౌలిక సదుపాయాలు, ఇంధన భద్రతను బలోపేతం చేయడానికి మోదీ సర్కార్ ముందడుగు వేసింది. ఇది ఈ రాష్ట్రాల్లో పరిశ్రమలను విస్తరిస్తుంది. ఆర్థిక వ్యవస్థకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుస్తుంది. రూ. 4,594 కోట్ల ఈ పెట్టుబడి ప్రాంతీయ అభివృద్ధి, ఉపాధి కల్పనలో కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇటువంటి ప్రాజెక్టులు భారతదేశం ప్రపంచ సాంకేతిక పటంలో మరింత సమర్థవంతంగా స్థిరపడటానికి సహాయపడతాయని నిపుణులు భావిస్తున్నారు.

## సామాన్యులకు శుభవార్త

భారత్‌లో 1.51 శాతంగా నమోదైంది. ఇటీవలి కాలంలో ఇదే చాలా తక్కువ కావడం విశేషం. కేంద్ర గణాంకాల కార్యాలయం డేటా ప్రకారం.. ఇది 8 ఏళ్ల కనిష్టం. చివరగా 2017 జూన్‌లో ఈ స్థాయిలో ద్రవ్యోల్బణం నమోదైంది. ముఖ్యంగా ఆహార పదార్థాల ధరలు తగ్గడమే రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గేందుకు కారణమైందని వెల్లడించింది. ముఖ్యంగా ఆర్బీఐ ద్రవ్యోల్బణం లక్షిత పరిధిని 2 శాతం నుంచి 6 శాతంగా నిర్ణయించుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే గత ఆరేళ్లలో తొలిసారి ఆర్బీఐ టార్గెట్ కంటే కూడా తక్కువగా నమోదవడం ప్రాధాన్యం సంతరించుకుంది. 2024 సంవత్సరం జులై నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.54 శాతంగా ఉంది. ఇక దీనికి ముందు జూన్ నెలతో చూస్తే కూడా 55 బేసిస్ పాయింట్ల వరకు ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టింది. రిటైల్ ద్రవ్యోల్బణంలో దాదాపు సగానికిపైగా వాటా ఫుడ్ ఇన్‌ఫ్లేషన్ (ఆహార ద్రవ్యోల్బణం) దే ఉంటుంది. ఇది గత నెలలో 1.06 శాతంగా ఉండగా.. ఇప్పుడు 1.76 శాతానికి దిగొచ్చింది. 2019 జనవరి తర్వాత ఇదే అత్యల్పం. ఇక గ్రామీణ ఆహార ద్రవ్యోల్బణం 1.74 శాతం కాగా.. అర్బన్ ఫుడ్ ఇన్‌ఫ్లేషన్ 1.90 శాతంగా ఉంది. ఇక్కడ ముఖ్యంగా దవ్యోల్బణం తగ్గేందుకు పప్పు ధాన్యాలు, కూరగాయలు, తృణ ధాన్యాలు, గుడ్లు, షుగర్, ట్రాన్స్‌పోర్ట్, కమ్యూనికేషన్ సర్వీసులు ఇలా అన్నింటా ధరలు తగ్గడమే కారణం. సాధారణంగా ఆర్బీఐ కీలక రెపో రేట్లను తగ్గించేందుకు కూడా ఈ ద్రవ్యోల్బణం గణాంకాల్ని కీలకంగా తీసుకుంటుంది. ద్రవ్యోల్బణం తగ్గుతున్న నేపథ్యంలో ఈ ఏడాది ఇప్పటికే వరుసగా 3 సార్లు మొత్తంగా ఒక శాతం వరకు రెపో రేటును తగ్గించగా.. గత వారం మాత్రం 5.50 శాతం వద్దనే స్థిరంగా ఉంచింది. అయితే ఇలా ద్రవ్యోల్బణం తగ్గుతుండటంతో.. ఆర్బీఐ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిచ్చేందుకు కీలక నిర్ణయాలు తీసుకునేందుకు దోహదం చేస్తుందని చెప్పొచ్చు.

## బంగారం చోరీ

కాల్పులు జరిపారు. గోల్డ్ లాకర్ కీస్ ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడ్డారు. అనంతరం షోరూంలోని వెండి సామాగ్రి, నగలు దోచుకున్నారు. మిగతా సిబ్బంది గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే షోరూం వద్దకు చేరుకున్నారు. కాల్పులు జరిపి దుండగులు జహీరాబాద్ వైపు పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. దోపిడీదారులు కేవలం 1 కేజీ వెండిని మాత్రమే తీసుకెళ్లినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ ఘటనపై సైబరాబాద్ పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు తెలంగాణ సరిహద్దు జిల్లాల్లో హైఅలెర్ట్ ప్రకటించారు. అన్ని చెక్‌పోస్టులను అప్రమత్తం చేశారు. ఉదయాన్నే జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వాణిజ్య ప్రాంతాల భద్రతపై ఆందోళనలకు దారితీసింది. షాపు యజమానులు భద్రతా చర్యలను పెంచాలని పోలీసులు సూచించారు. ఉదయం 10.40 గంటల సమయంలో దోపిడి దొంగలు లోపలికి ప్రవేశించనినట్లు షోరూం ఎగ్జిగ్యూటివ్ మేనేజర్ సులేమాన్ మేనేజర్ తెలిపారు. ముందు కస్టమర్లు అనుకున్నామని.. అందరూ మాస్కులు వేసుకొని ఉండటంతో అప్రమత్తమైనట్లు చెప్పారు. రావటం రావటమే తమ మేనేజర్ తొడపై కాల్పులు జరిపినట్లు తెలిపారు. దీంతో సిబ్బందితో సహా.. అందరం బయపడినట్లు వెల్లడించారు. ఈరోజే తమకు చివరి రోజు అన్నట్లు భయపడినట్లు వెల్లడించారు. అందరూ డబుల్ షర్ట్స్ వేసుకున్నరని.. ఎక్కడ్నుంచి వచ్చారో తెలియదు.. సడెన్‌గా వచ్చారన్నారు. మమ్మల్ని తిట్టడంటోపాటు, చేయి కూడా చేసుకున్నారని ఎగ్జిగ్యూటివ్ మేనేజర్ సులేమాన్ వెల్లడించారు.

# భారతం.. చాణిక్య వ్యూహం

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 50% టారిఫ్‌లు విధించాడు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిషేధించాలని ఒత్తిడి చేయడం ద్వారా భారత్‌ను శత్రు దేశంగా చూస్తున్నారనే సంకేతాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత్ తన సంప్రదాయ బహుముఖ విదేశాంగ విధానాన్ని ఉపయోగిస్తూ, రష్యా, చైనాలతో సంబంధాలను బలోపేతం చేస్తోంది.**



జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ రష్యా పర్యటన, ఆగస్టు 31న ప్రధాని నరేంద్ర మోదీ చైనా సందర్శన, కేంద్ర మంత్రులు జైశంకర్, రాజ్‌నాథ్ సింగ్‌ల ఇటీవలి చైనా పర్యటనలు ఈ వ్యూహాత్మక దృక్పథాన్ని సూచిస్తున్నాయి. పంచతంత్ర నీతి ప్రకారం భారత్ అమెరికా శత్రుదేశాలను ఏకం చేస్తోంది. ట్రంప్ భారత్‌పై 50% టారిఫ్‌లు విధించడం, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపాలని ఒత్తిడి చేయడం ద్వారా భారత్-అమెరికా సంబంధాలు గణనీయమైన సవాలును ఎదుర్కొంటున్నాయి. భారత్ రష్యా చమురు కొనుగోళ్లు ఉక్రెయిన్ యుద్ధానికి ఆర్థిక సహాయం చేస్తున్నాయని ట్రంప్ ఆరోపించారు. అయితే, భారత్ ఈ ఆరోపణలను "అన్యాయమైనవి, అసమంజసమైనవి" అని తిరస్కరించింది, రష్యా చమురు కొనుగోళ్లు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం కాదని, ఇది జాతీయ ఇంధన భద్రతకు కీలకమని స్పష్టం చేసింది. 2024లో భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 190 బిలియన్లు కాగా, ఈ టారిఫ్‌లు 64 బిలియన్ల ఎగుమతులను ప్రభావితం చేయవచ్చని అంచనాఇదిలా ఉంటే ట్రంప్ బ్రిక్స్ దేశాలను (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా) "యాంటీ-అమెరికన్" బ్లాక్‌గా భావిస్తున్నారు, ఇది డాలర్ ఆధిపత్యాన్ని సవాలు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిక్స్ సభ్య దేశాలపై అదనంగా 10% టారిఫ్‌లు విధించాలనే ట్రంప్ బెదిరింపు, భారత్‌ను రష్యా, చైనాలతో మరింత చేరువ చేసే అవకాశం ఉంది. ఈ ఒత్తిడి భారత్‌ను తన బహుముఖ విదేశాంగ విధానాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రేరేపిస్తోంది. భారత్-రష్యా సంబంధాలు "సమయ పరీక్షిత, విశ్వసనీయ" భాగస్వామ్యంగా కొనసాగుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం 65.7 బిలియన్ డాలర్లకు చేరింది, ఇందులో రష్యా నుంచి 61.44 బిలియన్ డాలర్ల దిగుమతులు (ప్రధానంగా చమురు) ఉన్నాయి. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ రష్యా పర్యటన, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఏడాది చివరలో భారత్ సందర్శనకు సన్నాహాలు చేస్తున్నాయి. ఈ సందర్శనలో ట్రంప్ టారిఫ్‌లు, రష్యా-ఇండియా-చైనా (ఆర్ఐసీ) త్రికోణ సహకారం ప్రధాన అంశాలుగా ఉంటాయని భావిస్తున్నారు. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కొనసాగించడం ద్వారా జాతీయ ఇంధన భద్రతను కాపాడుకుంటోంది, ఇది ట్రంప్ ఒత్తిడిని ఎదుర్కొనే వ్యూహంగా కనిపిస్తోంది. 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత భారత్-చైనా సంబంధాలు ఒడిదొడుకులను ఎదుర్కొన్నప్పటికీ, ఇటీవలి కాలంలో సాధారణీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. 2024 అక్టోబర్‌లో కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో మోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సమావేశమై, సరిహద్దు సమస్యలపై చర్చించేందుకు ప్రత్యేక ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఆగస్టు 31న మోదీ చైనాలోని టియాంజిన్‌లో జరిగే షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) సదస్సుకు హాజరవుతారు, ఇది ఏడేళ్లలో ఆయన తొలి చైనా సందర్శన. ఈ సందర్శనలో ట్రంప్ టారిఫ్‌లు, ద్వైపాక్షిక వాణిజ్యం, సరిహద్దు సమస్యలు ప్రధాన అంశాలుగా ఉంటాయి. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఆగస్టు 18న భారత్ సందర్శనలో ధోవల్‌తో సరిహద్దు సమస్యలపై చర్చిస్తారని తెలుస్తోంది. బ్రిక్స్ దేశాలు (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా) గ్లోబల్ సౌత్ దేశాలకు ప్రత్యామ్నాయ ఆర్థిక, రాజకీయ వేదికగా ఉద్భవించాయి. ట్రంప్ బ్రిక్స్‌ను యాంటీ-అమెరికన్ బ్లాక్‌గా ఆరోపిస్తున్నప్పటికీ, భారత్ ఈ సమూహంలో తన పాత్రను బలోపేతం చేస్తోంది. బ్రిక్స్ దేశాలు డాలర్ ఆధిపత్యానికి ప్రత్యామ్నాయ కరెన్సీలపై చర్చిస్తున్నాయనే ట్రంప్ ఆందోళన, భారత్‌ను ఈ సమూహంలో మరింత చురుకుగా పాల్గొనేలా ప్రేరేపిస్తోంది. అయితే, భారత్ బ్రిక్స్ కరెన్సీ ఆలోచనను ప్రత్యక్షంగా సమర్థించలేదు, దాని బహుముఖ విధానాన్ని కొనసాగిస్తోంది. రష్యా-ఇండియా-చైనా (ఆర్ఐసీ) త్రికోణం 1990లలో స్థాపించబడినప్పటికీ, ఇటీవలి ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో దీని పునరుజ్జీవనం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ మూడు దేశాలు అమెరికా ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి, ఇది వాటిని ఒకదానికొకటి చేరువ చేస్తోంది. మోదీ, పుతిన్, జిన్‌పింగ్ సమావేశం ఎస్‌సీవో సదస్సులో జరిగితే, అమెరికా దూకుడు విధానాలకు చెక్ పెట్టే వ్యూహాత్మక సహకారం ఏర్పడవచ్చు. ఈ త్రికోణం భారత్‌కు రష్యా, చైనాలతో వాణిజ్య, భద్రతా సహకారాన్ని బలోపేతం చేసే అవకాశాన్ని ఇస్తుంది, అదే సమయంలో అమెరికాతో సంబంధాలను సమతుల్యం చేస్తుంది. భారత్ తన "నాన్-అలైన్‌మెంట్" విధానాన్ని కొనసాగిస్తూ, అమెరికా, రష్యా, చైనాలతో సంబంధాలను సమతుల్యం చేస్తోంది. ట్రంప్ ఒత్తిడి ఉన్నప్పటికీ, భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపలేదు, ఇది జాతీయ ఆర్థిక, ఇంధన భద్రతకు కీలకమని పేర్కొంది. ప్రధాని మోదీ రైతులు, చేపల వేటగాళ్లు, డైరీ రైతుల ప్రయోజనాలను రాజీ పడనని స్పష్టం చేశారు, ఇది అమెరికాతో వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయ రంగంపై ఒత్తిడిని తిరస్కరించే సంకేతం. ఈ విధానం భారత్ యొక్క స్వాతంత్ర్య దృక్పథాన్ని, జాతీయ ప్రయోజనాలను ప్రతిబింబిస్తుంది. ట్రంప్ టారిఫ్‌లు, భారత్-రష్యా-చైనా సహకారం అమెరికాను ఆందోళనకు గురిచేస్తోంది. భారత్ యొక్క ఎస్‌సీవో, బ్రిక్స్ సదస్సులలో చురుకైన పాత్ర, ఎస్‌సీవో త్రికోణం యొక్క పునరుజ్జీవనం అమెరికా యొక్క ఏకపక్ష విధానాలకు సవాలుగా మారవచ్చు. మాజీ యూఎస్ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ జాన్ బోల్టన్ హెచ్చరించినట్లు, ట్రంప్ టారిఫ్‌లు భారత్‌ను రష్యా, చైనాలతో మరింత చేరువ చేయవచ్చు, ఇది అమెరికా యొక్క ఆసియా వ్యూహానికి వ్యతిరేక ఫలితాలను ఇవ్వవచ్చు.

> **చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఆగస్టు 18న భారత్ సందర్శనలో ధోవల్‌తో సరిహద్దు సమస్యలపై చర్చిస్తారని తెలుస్తోంది. బ్రిక్స్ దేశాలు (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా) గ్లోబల్ సౌత్ దేశాలకు ప్రత్యామ్నాయ ఆర్థిక, రాజకీయ వేదికగా ఉద్భవించాయి. ట్రంప్ బ్రిక్స్‌ను యాంటీ-అమెరికన్ బ్లాక్‌గా ఆరోపిస్తున్నప్పటికీ, భారత్ ఈ సమూహంలో తన పాత్రను బలోపేతం చేస్తోంది.**

## బంగారం దిగుమతులపై అదనపు సుంకాలు ఉండవు

అనే విషయంపై సందిగ్ధత నెలకొంది. దీనిపై అధ్యక్షుడు ట్రంప్ తాజాగా క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు కీలక ప్రకటన చేశారు. 'బంగారం' లాంటి వార్త చెప్పారు. బంగారం దిగుమతులపై అదనపు సుంకాలు ఉండవని స్పష్టం చేశారు. ఒక కేజీతోపాటు 100 ఔన్సుల (2.8 కిలోల) బంగారు కడ్డీలు సుంకాల పరిధిలోకి వస్తాయని అమెరికా కస్టమ్స్ అధికార వర్గాలు ఇటీవలే పేర్కొన్న విషయం తెలిసిందే. ఈమేరకు జులై 31న ఓ ప్రకటన విడుదల చేశారు. అదే సమయంలో గోల్డ్ బార్‌లపై సుంకాల విధింపుపై ట్రంప్ క్లారిటీ ఇస్తూ త్వరలోనే ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను జారీ చేస్తారని వైట్‌హౌస్ అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో ఈ విషయంలో గందరగోళం నెలకొంది. ఇదే సమయంలో పసిడి ధరలు కూడా అమాంతం పెరిగాయి. దీంతో ట్రంప్ తాజాగా క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు బంగారంపై సుంకాలు విధించబోమంటూ ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు. 'బంగారంపై సుంకాలు ఉండవు' అని రాసుకొచ్చారు.

## గులాబీ దళపతి మౌనమేలనోయి



వ్యూహంతో కొట్టుమిట్టాడుతోంది. గువ్వల బాలరాజు వంటి నాయకుల వలసలు, పార్టీ సోషల్ మీడియా విధానాలు, ప్రజా సమస్యలపై పోరాటాల లేమి వంటి అంశాలు బీఆర్ఎస్ దిగజారుడుకు కారణాలుగా కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ నుంచి ఇటీవల బీజేపీలో చేరిన గువ్వల బాలరాజు వ్యవహారం పార్టీలోని అంతర్గత సమస్యలను స్పష్టంగా తెలియజేస్తోంది. బాలరాజు తన రాజీనామా లేఖలో బీఆర్ఎస్ నాయకత్వాన్ని గౌరవిస్తూనే, తన రాజకీయ భవిష్యత్ కోసం బీజేపీలో చేరినట్లు పేర్కొన్నారు. అయితే, బీఆర్ఎస్ సోషల్ మీడియా బృందం ఆయనను, ఆయన భార్యను వ్యక్తిగతంగా విమర్శిస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా పార్టీ ఇమేజ్‌ను మరింత దిగజార్చింది. రాజకీయ నాయకులు ఒక పార్టీ నుంచి మరొక పార్టీకి వెళ్లడం సర్వసాధారణం. అయితే, వలసపోయే నాయకులపై వ్యక్తిగత దాడులు చేయడం, బూతులతో కూడిన సోషల్ మీడియా పోస్ట్‌లు చేయడం వంటివి గులాబీ పార్టీకి రాజకీయంగా నష్టం కలిగిస్తున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నడిచే సోషల్ మీడియా పోస్టులు ఆయనకు తెలియకుండా వస్తున్నవి కావన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటువంటి విమర్శలు ప్రజల్లో పార్టీపై చిరాకు, అసహ్యం కలిగించే అవకాశం ఉంది. బాలరాజు స్పందన కూడా ఈ విమర్శలకు బదులుగా తీవ్రంగా ఉండటం, బీఆర్ఎస్ వ్యూహం రివర్స్ అవుతున్నట్లు సూచిస్తోంది. బీఆర్ఎస్ సోషల్ మీడియా వ్యూహాలను ఏపీలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విధానాలతో పోలుస్తున్నారు. వ్యతిరేకులపై అనుచిత వ్యాఖ్యలు, బూతులతో కూడిన ట్వీట్‌లు, తప్పుడు ప్రచారం చేయడం వంటివి బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రధాన లక్షణాలుగా మారాయి. ఈ విధానం ఓటర్లను ఆకర్షించడంలో విఫలమవడమే కాక, పార్టీకి ఉన్న మద్దతుదారులను కూడా అసంతృప్తికి కారణమవుతోంది. సోషల్ మీడియాను రాజకీయ ఆయుధంగా ఉపయోగించుకోవచ్చు, కానీ అది సానుకూలంగా, ఆకర్షణీయంగా ఉండాలి. బీఆర్ఎస్ విషయంలో, సోషల్ మీడియా బృందం ప్రతికూల వ్యాఖ్యలపై దృష్టి సారించడం వల్ల పార్టీ ఇమేజ్ దెబ్బతింటోంది. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై గ్రౌండ్ లెవల్‌లో ఎలాంటి పోరాటం చేయలేదు. పార్టీ నిర్వహించే కార్యక్రమాలు ఎక్కువగా రాజకీయ లక్ష్యాలతో లేదా కేసీఆర్ సమస్యల చుట్టూ తిరుగుతున్నాయి. తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలు ఉపాధి, విద్య, ఆరోగ్యం, లేదా రైతు సమస్యలపై బీఆర్ఎస్ ఎలాంటి ఉద్యమం చేపట్టలేదు. కేవలం రాజకీయ లాభాల కోసం కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పార్టీ ప్రజల నుంచి దూరమవుతోంది. ఒక బలమైన ప్రతిపక్షంగా, ప్రజల సమస్యలను గుర్తించి, వాటి కోసం గళమెత్తి, ఉద్యమాలు నడిపితేనే ప్రజల విశ్వాసం సంపాదించగలదు. బీఆర్ఎస్ నాయకత్వం స్పష్టమైన దిశానిర్దేశం లేకుండా కొట్టుమిట్టాడుతోంది. పార్టీ నుంచి నాయకులు వలసపోవడం, సోషల్ మీడియాలో అనుచిత వ్యవహారం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా వ్యక్తిగత దూషణలకు దిగడం, దిగజారుడు మాటలు మాట్లాడడం, ఇక కవిత సొంత పార్టీకి దూరం కావడం, గులాబీ నేతలపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం బీఆర్ఎస్ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. పార్టీ నాయకత్వం ఒకప్పుడు తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచినప్పటికీ, ప్రస్తుతం పార్టీలో కొత్త నాయకత్వం, కొత్త వ్యూహాలు అవసరమైన సమయంలో పాత విధానాలతోనే ముందుకెళ్లడానికి ప్రయత్నిస్తోంది.

## ఆరోపణలను రుజువు చేయాలని సవాల్..!

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో చిల్లరగా, దిగజారి మాట్లాడటం సరికాదన్నారు. దమ్ముంటే ఆరోపణల్లో ఒక్క శాతం నిజమున్నా నిరూపించాలని సవాల్ చేశారు. లేదంటే ఆరోపణలను ఉపసంహరించుకొని 48 గంటల్లో బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. లీగల్ నోటీసులు పంపిస్తున్నానని, 48 గంటల్లో స్పందించకుంటే కోర్టుకు ఈడుస్తానని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. సున్నితమైన అంశంపై సంజయ్ హద్దు మీరి మాట్లాడుతున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. కనీసం కామన్ సెన్స్ లేకుండా, వాస్తవాలను తెలుసుకోకుండా, అసంబద్ధమైన, దిగజారుడు, థర్డ్‌క్లాస్ స్థాయిలో చిల్లర కామెంట్లు చేయడం ఆయనకు రివాజుగా మారిందని నిప్పులు చెరిగారు. రాజకీయాల్లో చవకబారు పబ్లిసిటీ కోసం, మీడియా దృష్టిని ఆకర్షించేందుకు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఫోన్ ట్యాపింగ్ అంశం ఎంత సున్నితమైందో, చట్టపరంగా ఎంత కఠినమైందో సంజయ్‌కి తెలియకపోవడం విడ్డూరమని, కేంద్రమంత్రిగా ఉన్న సంజయ్‌కి నిఘా వ్యవస్థల పనితీరు, విధానాలపై కనీస అవగాహన, పరిజ్ఞానం, ఇంగితజ్ఞానం కూడా లేకపోవడం దురదృష్టకరమని ఎద్దేవాచేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న సంజయ్..ఉద్దేశపూర్వకంగా వాస్తవాలను వక్రీకరిస్తున్నారని, సాక్ష్యాలు లేకుండా ఆరోపణలు చేయడం ఆయన రాజకీయ దిగజారుడు తనానికి నిదర్శనమని కేటీఆర్ మండిపడ్డారు. కేంద్రమంత్రిగా పనిచేయడం అంటే ఢిల్లీ బాసులకు చెప్పులు మోసేంత ఈజీ కాదనే విషయం గ్రహించాలని దెప్పిపొడిచారు. ఫోన్ ట్యాపింగ్‌పై సంజయ్ మాట్లాడిన ప్రతిసారీ దిగజారుతున్నారని, తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఫైర్ అయ్యారు. మీడియాలో ఛీప్ పబ్లిసిటీ కోసం వీధి నాటకాలు ఆడుతున్నారని విరుచుకుపడ్డారు. ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

# ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- భారత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్
- షాద్ నగర్ బాలికల వసతి గృహంలో ఆవిర్భావ దినోత్సవ వేడుక
- ఏఐఎస్ ఎఫ్ జండా ఆవిష్కరించిన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం పవన్ చౌహాన్




జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 12 :

ఘనంగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆవిర్భావ దినోత్సవ వేడుక. స్వతంత్రం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్. మంగళవారం షాద్ నగర్ నియోజకవర్గంలో ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం జరిగింది.ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ ఆధ్వర్యంలో ఈ యొక్క కార్యక్రమం నిర్వహించి ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్ హాజరయ్యారు.

అనంతరం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పవన్ చవాన్ జెండా ఆవిష్కరించారు. విద్యార్థులతో ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పవన్ చవాన్ మాట్లాడుతూ.. భారత దేశ స్వాతంత్ర్యమే లక్ష్యంగా దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘంగా ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో మహానగరంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్, ఆజాద్ ల ఇంకా ఎందరో వీరుల ఆశయ సాధన కోసం బబ్రుద్దీన్, ప్రేమ్ నారాయణ భార్గవ్ ల నాయకత్వాన 1936 ఆగస్టు 12న ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించింది అని అన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదుల బానిసచేర నుంచి మాతృభూమి విముక్తి కై సాగిన వీరోచిత స్వాతంత్ర్య ఉద్యమంలో పొత్తిళ్లలోనే పిడికిళ్లు బిగించి స్వాతంత్ర్యము మా జన్మహక్కు అని మా అంతం చూసిన స్వాతంత్ర్యోద్యమ పంతం వీడం అంటూ నినదించి భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని, భరతమాత బానిస సంకెళ్ళ నుంచి విముక్తి కావాలని ఎందరో విద్యార్థుల విప్లవ కిషోరులను బలిదానం చేసిన ఘనమైన చరిత్ర కలిగిన దేశములోనే ఏకైక విద్యార్థి సంఘం పోరాటాలు, త్యాగాలే ధ్యేయంగా ఏర్పాటైన ఈ విద్యార్థి సంఘం స్వాతంత్ర్య అనంతరం ప్రభుత్వ విద్యా పరిరక్షణకై, శాస్త్రీయ విద్య, కామన్ విద్యావిధానం అమలుపై* నిరంతరం పోరాటాలు సాగిస్తూ 89 సంవత్సరాలుగా విద్యార్థుల శ్రేయస్సు కోసం అశేష త్యాగాలు చేస్తూ ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు గల్లి నుండి డిల్లీ వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలే ఊపిరిగా , పోరాటాలే ప్రాణంగా, విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా చదువుతూ పోరాడుతాం చదువుకై పోరాడుతాం అంటూ విద్యార్థుల కోసం పనిచేస్తుందని అన్నారు.

శాస్త్రీయ సోషలిజం తన గమ్యంగా, ప్రభుత్వ విద్యను, సెక్యులరిజాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడం తన కర్తవ్యమని, సమరశీల విద్యార్థి ఉద్యమాల నిర్మాణంలో నిమగ్నమైన అఖిల భారత విద్యార్థి సమాఖ్య ( ఏఐఎస్ఎఫ్) 89 వసంతాలు పూర్తిచేసుకుని 90వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా విద్యార్థి విద్యార్థులతో కేక్ కట్ చేయించడం జరిగింది. విద్యార్థి విద్యార్థులకు అరటి పండ్లు పంచడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ షాద్ నగర్ కమిటీ సాయి చవాన్, రాహుల్, అరుణ్, ప్రకాష్, సునీల్, గణేష్, గర్ల్స్.. అంకిత, నిఖిత, నందిని, స్వాతి, పవిత్ర, పల్లవి, తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.



## మూడు రోజులు భారీ వర్షాలు

జయభేరి, మేడ్చల్ :

రాబోయే 3 రోజులు, అంటే ఆగస్టు 13 బుధవారం నుండి ఆగస్టు 15 శుక్రవారం వరకు, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలకనుగుణంగా మేడ్చల్ జిల్లాలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. భారీ వర్షాలకు సంబంధించి సమాచారం తెలుసుకోవడానికి, ఇవ్వడానికి గాను జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రజలకు వర్షాలకు సంబంధించిన ఏవైనా సమస్యలుంటే కంట్రోల్ రూం ఫోన్ నంబరు 949240978 1లో సంప్రదించగలరని సూచించారు. ప్రజలు ఇట్టి అవకాశాన్ని వినియోగించుకొని ముందస్తుగా జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. వర్షాల వల్ల హైదరాబాద్ ఉత్తర ప్రాంతాలు (సైబరాబాద్, మేడ్చల్ జిల్లా ప్రాంతాలు) ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశం ఉందని 10/15 సెం.మీ వరకు వర్షపాతం నమోదు అవుతుందని ప్రజలు రాబోయే మూడు రోజులు వాహనాల రాకపోకలు తగ్గించుకోవాలి కలెక్టర్ తెలిపారు.

## సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున్ రావుకు ఘన సన్మానం

జయభేరి, వెంకటాపురం, ఆగస్టు 12 :



వెంకటాపురం సిపిఐ పార్టీ ములుగు జిల్లా కార్యదర్శిగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన తోట మల్లికార్జునరావు ను వాడబలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వెంకటాపురం మండలంలోని విఆర్కెపురం గ్రామంలో వాడబలిజ సేవా సంఘం నాయకులు పెద్ద ఎత్తున తోట మల్లికార్జున రావు స్వగృహం చేరుకొని ఆయనను శాలువాతో సత్కరించి సీట్లు పంచుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వాడబలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డర్ర దామోదర్ మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా సిపిఐ పార్టీ సిద్ధాంతాలను నమ్ముకొని పనిచేస్తూ పేద ప్రజల మన్నలను పొందుతూ,వార్డ్ మెంబర్ స్థాయి నుండి సొసైటీ ప్రెసిడెంట్ గా, మండల సెక్రెటరీగా అలాగే ములుగు జిల్లా సెక్రెటరీగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నుకయ్యే ఆ ఘనత మల్లికార్జున రావు కే దక్కుతుందని తెలియజేశారు. వాడ బలిజ కులంలో పుట్టినందుకు గర్విస్తున్నామన్నారు. సిపిఐ పార్టీలో అంచలంచలుగా ఎదుగుతూ ఒకవైపు వాడబలిజ సేవా సంఘాన్ని తనదైన శైలిలో తన వంతు సహాయంగా సూచనలు సలహాలు అందిస్తూ రాష్ట్ర సలహాదారుగా రాష్ట్ర అధికార ప్రతినిధిగా సంఘానికి ఎంతో కృషి చేస్తూ ఉండగా ఉంటూ సంఘాన్ని నడిపించేందుకు ఆయన పాత్ర కీలకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు అల్లి సూరిబాబు, అధికార ప్రతినిధి బొల్లె ఆదినారాయణ, భద్రాద్రి జిల్లా అధ్యక్షులు తోట ప్రశాంత్, వెంకటాపురం మండల అధ్యక్షులు బొల్లె సునీల్, నాయకులు వెంకటేశ్వర్లు, డర్ర రవి, డర్ర గోపి, టేకుల దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులు దురదృష్టకరం

- రేవంత్ రెడ్డి పాలనలో హిందువులకు స్వేచ్ఛ లేదు
- అక్రమ అరెస్టులను ఖండించిన బిజెపి నాయకులు




జయభేరి, దేవరకొండ :

హైదరాబాద్లోని పెద్దమ్మగుడి దగ్గర కుంకుమార్చనకు హిందూ సంఘాల పిలుపు మేరకు దేవరకొండ నుండి బయలుదేరుతున్నారు అనే సమాచారంతో ముందస్తుగా అరెస్ట్ లు చేసి దేవరకొండ పోలీస్ స్టేషన్ కు తరలించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెద్దమ్మగుడి దగ్గర కూల్చివేతలు చేపట్టడాన్ని హిందూ సంఘాలు భారీ ఎత్తున వ్యతిరేకించడం జరిగింది, ఈ నేపథ్యంలో హిందూ సంఘాల పిలుపుమేరకు చేపట్టబోయే కుంకుమార్చన కార్యక్రమాన్ని అడ్డుకోవడం తెలంగాణ రాష్ట్రంలో దురదృష్టకరమణి భారతదేశానికి స్వాతంత్రం వచ్చినప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో హిందువులకు రేవంత్ రెడ్డి పాలనలో స్వచలేదను బిజెపి నాయకులు ఆరోపించారు. ముందస్తు అరెస్ట్ అయిన వారిలో బిజెపి నాయకులు దేవరకొండ బిజెపి పట్టణ అధ్యక్షులు వస్కుల సుధాకర్, మాజీ పట్టణ అధ్యక్షులు గుండాల అంజయ్య, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి శంకర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పగిళ్ల సాగర్, మాజీ పట్టణ కార్యదర్శి అప్పం అజయ్ లను అరెస్ట్ చేయడం జరిగింది.

## ఉపాధ్యాయుల డిప్యూటేషన్ల ను రద్దు చేయాలి

- ప్రభుత్వ ఉత్తర్వులను లెక్కచేయని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి
- అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని డిమాండ్
- ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్




జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 12 :

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో రాజకీయ నాయకుల పైరవీలతో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ , జిల్లా విద్యాశాఖ అధికారుల కార్యాలయాల నుండి కొందరు ఉపాధ్యాయులు ఇప్పటికే ఎక్కువ సంఖ్యలో డిప్యూటేషన్లతో గ్రామీణ గిరిజన ప్రాంతాలను వదిలి హైదరాబాద్ పట్టణ ప్రాంతాలకు క్యూ కడుతున్నారని దాంతో గ్రామీణ గిరిజన ప్రాంతాల విద్యార్థులు విద్యా నష్టపోతున్నారని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ అన్నారు. జిల్లేడు చౌదర్ గుడా మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల ముందు ప్లాక్ కార్డులతో మంగళవారం ఆందోళనకు దిగారు.

ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ;చౌదర్ గూడ మండలం మొదలుకొని కొందుర్గు ఫరూక్ నగర్ నందిగామ కొత్తూరు మండలాలతో పాటు జిల్లా వ్యాప్తంగా అక్రమ డిప్యూటేషన్ల పరంపర కొనసాగుతుందని దీనికి రాజకీయ నాయకుల పైరవీలే కారణమని ఉపాధ్యాయుల అమ్యామ్యాల పర్వంతోనే అక్రమ డిప్యూటేషన్ల పర్వం కొనసాగుతుందని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇచ్చిన డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వానిబంధనలను తుంగలో తొక్కుతున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేనియెడల జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివశంకర్ ప్రవీణ్ మనీ రాజు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాపురంలో మంత్రి అనిత పర్యటన

జయభేరి, అనకాపల్లి:



యస్ రాయవరం మండలం వెంకటాపురం గ్రామంలో అనితమ్మ పార్క్ ను హోం మంత్రి అనిత ప్రారంభించారు. తరువాత అక్కడ వెంకటాపురం గ్రామంలో రైతు సంభర సభలో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ వ్యవసాయం కోసం రైతులు ఎంతో కష్టపడతారు. రైతులకు ఎన్డియే ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుంది. అన్నదాత సుఖీభవ ద్వారా ఇరవైవేల రూపాయలు ఇస్తున్నాం. గత ప్రభుత్వంలో రూ 13,500 మాత్రమే ఇచ్చేవారని అన్నారు. విత్తనం వేసిన దగ్గర నుండి పంట అమ్మకం వరకు ఎన్డియే ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది. వ్యవసాయంలో డ్రోన్స్ ఉపయోగించేలా కృషి చేస్తున్నాం. వ్యవసాయ సులభతరం కోసం టెక్నాలజీని ఉపయోగిస్తున్నాం. సేంద్రీయ వ్యవసాయాన్ని కూడా ప్రోత్సహిస్తున్నాం. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతు ఖాతాల్లో నగదు జమ అవుతుంది. గత ప్రభుత్వంలో 21 రోజులు గడిచిన రైతులు ఖాతాల్లో డబ్బులు జమ అవ్వేవి కాదు. యోజకవర్గంలో బల్క్ డ్రగ్,స్టీల్ ప్లాంట్ రాకతో ఉద్యోగావకాశాలు రాన్నాయని అన్నారు. మహిళల ఉపాధిపై కూడా దృష్టి పెట్టాం. ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇచ్చాం. ఆగస్టు 15 నుండి ఉచిత బస్సు పథకం ప్రారంభమవుతుంది. బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. గత 30 సంవత్సరాలు నుండి ఉప్పరాపల్లి నుండి వెంకటాపురం వెళ్ళడానికి రోడ్డు లేదు. సంవత్సరం లోపే ఉప్పరాపల్లివెంకటాపురం రోడ్డు వేసాం. మూడు కోట్ల రూపాయలతో వెంకటాపురం గ్రామాన్ని అభివృద్ధి చేసామని అన్నారు.



## విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ అందజేత

జయభేరి, గజ్వేల్, ఆగస్ట్ 12 :

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చాంద్ ఖాన్ ముక్త చదివి అందరు విద్యార్థులకు (50 మంది) స్పోర్ట్స్ యూనిఫామ్ ను హైదరాబాదుకు చెందిన కీర్తిశేషులు దేవులపల్లి కేశవరావు పేరు మీదుగా వారి స్నేహితులు శ్రీనివాస్ రెడ్డి 25 వేల రూపాయలతో పిల్లలందరికీ బట్టలను ఇప్పించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేవులపల్లి కేశవ్ పేద బడుగు బలహీన వర్గాల పిల్లలకు చదువు అందుబాటులో ఉండాలని సుమారు వందకు పైగా విద్యార్థులను ఇంజనీరు డాక్టర్లు లాంటి ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందించారు. అని పేర్కొన్నారు.. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు కనకరాజు గ్రామ ఎంపీటీసీ సజనితా రెడ్డి పిఆర్టియు జిల్లా కార్యదర్శి శశిధర్ శర్మ పిఆర్టియు మండల అధ్యక్ష కార్యదర్శులు తోకల చంద్రశేఖర్ రెడ్డి, నరసింహారెడ్డి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నరసింహారెడ్డి పాల్గొని విద్యార్థులు ఎంత చక్కని అవకాశాన్ని వినియోగించుకొని మంచిగా చదువుకోవాలని విద్యార్థులకు సూచన చేశారు ప్రైవేటుకు ధీటుగా అన్ని వసతులు కల్పిస్తున్నటువంటి పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రశాంత్ కుమార్, సుమన్ ను అభినందించారు.

## మృతురాలి కుటుంబానికి అండగా జై భీమ్ యూత్

- 50 కిలోల బియ్యం , ఆర్థిక సహాయం అందజేత



జయభేరి, గజ్వేల్, ఆగస్టు 12 :

జగదేవపూర్ మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన కొలిపాక చిన్న యాదమ్మ. కొద్ది రోజుల క్రితం మృతి చెందటం జరిగింది. బాధిత నిరుపేద మృతురాలి కుటుంబానికి తమ వంతుగా ఆర్థిక సహాయం చేయటం జరిగింది. మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి, మనోధైర్యాన్ని కల్పించి భాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేయటం జరిగింది. జై భీమ్ యూత్ అధ్యక్షులు ఆకారం మహేందర్ మాట్లాడుతూ.. దౌలాపూర్ గ్రామ నిరుపేద కుటుంబాలకు ఎల్లపుడూ మా జై భీమ్ యూత్ అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కేశపురం రాజు (JLM),ముక్కెర సురేష్, ఆకారం వంశీ, మల్లేష్, శివ, కోలిపాక భాస్కర్ , ప్రవీణ్,ముక్కెర పవన్, విక్రమ్,ఆకారం ప్రశాంత్ మరియు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబాలకు అండగా చిలుకూరి బాల్ రెడ్డి ట్రస్ట్

- ఆర్థిక సహాయం చేస్తున్న చిలుకూరి మధుసూదన్ రెడ్డి



జయభేరి, జగదేవపూర్/ గజ్వేల్, ఆగస్టు 12 :

చిలుకూరి బాల్ రెడ్డి ట్రస్ట్(BLR )వ్యవస్థాపకులు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిలుకూరి మధుసూదన్ రెడ్డి జగదేవపూర్ మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన ఆకారం వెంకటమ్మ కుమార్తె కల్పన వివాహానికి రూ.5000 రూపాయలు నగదు అందజేయడం జరిగింది. నిరుపేద కుటుంబమైనటువంటి కొలిపాక చిన్న యాదమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిలుకూరు మధుసూదన్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి మృతురాలి కుటుంబనికి 5000 వేలు ఆర్థిక సహాయం చేశారు. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. దౌలాపూర్ గ్రామ ప్రజలకు మా BLR trust ఎల్లపుడు అండగా ఉంటుంది. ఈ కార్యక్రమంలో కొండ పోచమ్మ మాజీ డైరెక్టర్ నాగరాజు, మాజీ ఉపసర్పంచ్ కదుర్ల రాజు, టిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు బంగారి, ఆకారం నర్సింలు, కేశాపురం పెద్దులు, సాయిలు, ఈరామైన మైసయ్య, అనుమాండ్ల రాజు,దేశెట్టి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాపురం మండలానికి బస్ సౌకర్యం కల్పించాలి



జయభేరి, వెంకటాపురం, ఆగస్టు 12 :

భద్రాచలం నుండి వెంకటాపురానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ వెంకటాపురం మండల బిజెపి ప్రధాన కార్యదర్శి సాధనపల్లి విజయ్ కుమార్ భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ బి తిరుపతి కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వృద్ధులు,విద్యార్థులు, ఆసుపత్రికి వెళ్ళే రోగులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు బస్ సౌకర్యం లేకపోవటంతో నానా అవస్తలు పడుతున్నారని వాపోయారు.ఎదిర, సూరవీడు, అబ్బాయిగూడం,ఆలుబాక గ్రామాల్లోని విద్యారులు బస్ సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాన్ని ఆశ్రయిస్తూ రోజూ 100 నుండి 150 రూపాయలు వరకు నష్టపోతున్నారని,కొంతమంది విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని, మండలంలో వెంటనే బస్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం బీజేపీ మండల అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్,మాజీ అధ్యక్షులు రామ్మోహన్ నాయుడు,నాగబాబు పాల్గొన్నారు.



## వరలక్ష్మీ వ్రతం, రాఖి పండుగ స్పెషల్ ఆపరేషన్స్ విజయవంతం

**జయభేరి, దేవరకొండ :**

వరలక్ష్మీ వ్రతం మరియు రాఖి పండుగకు సంబంధించి స్పెషల్ ఆపరేషన్స్ విజయవంతంగా నిర్వహించడం తో డిపో మేనేజర్ తల్లాడ రమేష్ బాబు కేక్ కట్ చేసి ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాఖీ పౌర్ణమి నాడు (9/8/25) 51824 KMs బస్సులు తిప్పి, 71251 ప్యాసింజర్స్ ని అందులో 51937 మహిళా ప్యాసింజర్స్ ని వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేరవేసి 57.80 లక్షల రూపాయలు (17.54 లక్షల fare paid ఆదాయం) సంపాదించాము. 169 OR తో రాష్ట్రంలో నాలుగవ స్థానంలో, రీజియన్ లో మొదటి స్థానంలో నిలిచామని అంతేకాకుండా తేదీ .11/8/25 నాడు 52364 KMs బస్సులు తిప్పి, 71421 ప్యాసింజర్స్ ని అందులో 49869 మహిళా ప్యాసింజర్స్ ని వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేరవేసి 49.87 లక్షల రూపాయలు (18.42 లక్షల fare paid ఆదాయం) సంపాదించాము. 144 OR తో, 11 వ తారీకు వరకు 123.1 OR తో రాష్ట్రంలో మూడవ స్థానంలో, రీజియన్ లో స్థానంలో మొదటి స్థానంలో నిలిచామని తెలియజేశారు. ఇది అంతా ఉద్యోగుల కృషి, పట్టుదల వలనే సాధ్యమైనది. అందుకుగాను ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ స్ఫూర్తిని ఇలాగే కొనసాగిస్తూ దేవరకొండ డిపో ఇంకా అభివృద్ధి పదంలో కొనసాగేందుకు కృషి చేయాలని ఉద్యోగులకు సూచించారు, ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సైదులు, ఆఫీస్ సిబ్బంది. ఉద్యోగులు పాల్గొన్నారు.

## వృద్ధుల ఆశ్రమంలో బిస్కెట్స్, భోజనాలు ఏర్పాటు



**జయభేరి, దేవరకొండ :**

స్థానిక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సీనియర్ సభ్యురాలు శ్రీమతి పిశిక సత్యావతి రిటైర్డ్ టీచర్ 78వ పుట్టినరోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యులు వారు దేవరకొండ శ్రీ మహాలక్ష్మి మహిళా వృద్ధుల ఆశ్రమంలో మాతలకు బిస్కట్స్ పంపిణి చేసి అనంతరం మాతలకు భోజనాలు అందజేసినారు. ఈ సందర్భంగా ఆశ్రమం అధ్యక్షురాలు శ్రీమతి మాదిరెడ్డి సంధ్యారెడ్డి గారు దాతను శాలువతో సత్కరించి వారి సేవాగుణమును పొగిడినారు. పెన్షనర్స్ సంఘం బాధ్యులు, సభ్యులు వారి పుట్టినరోజులు పెండ్లి రోజుల సందర్భంగా మా ఆశ్రమం సందర్శించి మాతలకు భోజనాలు ఏర్పాటు చేయడం, సలహాలు ఇవ్వడం సంతోషం అన్నారు మరియు పురుషులకు కూడ ఆశ్రమం ఏర్పాటు చేసినాము అవసరం కలిగిన వృద్ధ పురుషులకు తెలియజేయగలరని అన్నారు. దాత పిశిక సత్యావతి మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కలిగించిన పెద్దలు అధ్యక్షులు తాడిశెట్టి నరసింహ, కార్యదర్శి తమ్ముడు అంకం చంద్రమౌళి, కోశాధికారి పంగనూరు లింగయ్య లకు కృతజ్ఞతలు తెలియజేసినారు. అలాగే ఏర్పాటు చేసిన కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు గుమ్మడవల్లి కోటయ్య, అలంపల్లి శ్రీనివాసులు, కేర్టకర్ జానకి తదితరులు పాల్గొన్నారు.

## లైబ్రరీ డే దినోత్సవ వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**

స్థానిక ఎం కె ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల దేవరకొండ అటానమస్ లో లైబ్రరీ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమావత్ రవి ఆధ్వర్యంలో లైబ్రరీ డే దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా లైబ్రరీ సైన్స్ పితామహుడు డాక్టర్ రంగనాథన్ కి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ c.లింగమయ్య COE జి లింగారెడ్డి, లైబ్రరీ కోఆర్డినేటర్ డాక్టర్ K. రేణుక, లైబ్రరీ రికార్డ్ అసిస్టెంట్ S. వెంకట్ రెడ్డి, తదితర అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఫిజిక్స్ G. లింగారెడ్డి కళాశాల లైబ్రరీకి 40 పుస్తకాలను లైబ్రరీ కోఆర్డినేటర్ డాక్టర్ K . రేణుక కు ఇవ్వడం (అందించడం)జరిగింది. ఈ సందర్భంగా సి ఓ ఈ G. లింగారెడ్డి ని కళాశాల ప్రిన్సిపల్ అభినందించడం జరిగింది.

## శ్రీశ్రీశ్రీ రాఘవేంద్ర స్వామి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి

- ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, ఉప్పల్ :**

హబ్సిగూడ డివిజన్ గణేష్ నగర్ లో గల రాఘవేంద్ర స్వామి దేవాలయంలో శ్రీ శ్రీ శ్రీ రాఘవేంద్ర స్వామి 354వ ఆరాధన ఉత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ స్వామి వారి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని కాపాడే ఏకైక పార్టీ బీఎస్పీ

- బీసీ రిజర్వేషన్లు సాధించడంలో రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ కి అమలు చేయడంలో కేంద్ర బిజెపికి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- బీఎస్పీ అధికారంలోకి రావడం ద్వారానే బిసి రిజర్వేషన్లు, బీసీలకు సామాజిక న్యాయం, బీసీల అభివృద్ధి జరుగుతుంది




**జయభేరి, చర్ల, ఆగస్టు 12 :**

చర్ల మండలంలో పార్టీ మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు గోగికార్ రామ్ లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది ఈ ఈ సమావేశానికి పార్టీ భద్రాచలం నియోజకవర్గం అసెంబ్లీ అధ్యక్షులు కొండా చరణ్ హాజరయ్యారు ఈ సందర్భంగ కొండా చరణ్ మాట్లాడుతూ బీసీ లకు రిజర్వేషన్లు సాధించడంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ కి కేంద్రంలోని బిజెపి సర్కార్ కి చిత్తశుద్ధి లేదని బీసీలను మాయ చేయడానికి ఓట్లు దండుకోవడానికి కాంగ్రెస్ ఆడుతున్న కపటనాటకమని అన్నారు దేశంలో 1950 నుండి 1993 దాకా 43 సంవత్సరాల పాటు బీసీలకు ఏ రంగంలో రిజర్వేషన్లు అమలు జరగకుండా అడ్డు పడ్డది కాంగ్రెస్సే అని అన్నారు బీఎస్పీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్సీ రామ్ పోరాట ఫలితంగా వీపీ సింగ్ సర్కార్ బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు ప్రకటించినప్పుడు ఈ రిజర్వేషన్ ప్రకటనకు వ్యతిరేకంగా బిజెపి ఆందోళన పోరాటాలు చేసిందని తెలియజేశారు కేంద్రంలో రాష్ట్రంలో అధికారంలో ఉండి ఇప్పటివరకు బీసీలకు చట్టసభల్లో అవకాశం లేకుండా కాంగ్రెస్ బిజెపి ఆటలాడుతున్నాయని అన్నారు బీసీ సమాజం ఆది నుంచి బీసీలను మోసం చేసుకున్న కాంగ్రెస్ బిజెపి లను నమ్మొద్దని బీఎస్పీగా పిలుపునిస్తున్నామని తెలిపారు.

బీఎస్పీ స్పష్టంగా బీసీ రిజర్వేషన్ల పట్ల బీసీల అభివృద్ధి పట్ల బీసీలకు సామాజిక న్యాయం జరపడం పట్ల చిత్తశుద్ధితోటి పార్టీ పుట్టినప్పటి నుండి ఇప్పటివరకు పోరాటం చేస్తుందని అన్నారు అంబేద్కర్ దయవల్ల ఆర్టికల్ 340 ద్వారా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని భారత రాజ్యాంగం తెలుపుతున్నప్పటికీ నాడు నెహ్రూ ప్రభుత్వం ఇందిరా సర్కారు బీసీ రిజర్వేషన్లు తుంగలో తొక్కాయి అని విమర్శించారు తెలంగాణ రాష్ట్రంలో 56% ఉన్న బీసీలకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు ఇస్తామనడం శోచనీయమని అన్నారు దేశవ్యాప్తంగా బీసీ కులగణాలు చేయాలని బిజెపి కులగలను చేస్తామని ప్రకటించి ఇన్ని రోజులు అవుతున్నప్పటికీ ఇప్పటివరకు చేయలేదని విమర్శించారు అగ్రవర్ణాలకు ఎన్నో పార్టీలు ఉన్నాయని బీఎస్పీ కేవలం బీసీల కు సామాజిక న్యాయం కోసం రాజకీయ ప్రాతినిధ్యం చట్టసభల్లో ప్రాతినిధ్యం కోసం కోసం ఏర్పాటు చేసిన పార్టీ అని అన్నారు.

అగ్రవర్ణ పార్టీలు భారత రాజ్యాంగాన్ని మార్చేసే కుట్రలు చేస్తున్నాయని భారత రాజ్యాంగం ద్వారా ఫలాలు పొందుతున్న బహుజన జాతులు ఐక్యంగా భారత రాజ్యాంగ రక్షణకై బీఎస్పీ తోటి కలిసి రావాలని బి.ఎస్.పి కి అధికారం ఇవ్వడం ద్వారానే బిసి లకు న్యాయబద్ధంగా రాజకీయ అన్ని రంగాల్లో రిజర్వేషన్లు అమలు జరగడానికి అవకాశం ఉంటుందని తెలిపారు కొండా కౌశిక్ గుర్రాల విజయ్ కుమార్ చెన్నం మోహన్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# బంగారు భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది

- జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

**జయభేరి, మేడ్చల్ :**



మీ కలలను నిజం చేసుకొని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవడం మీ చేతుల్లోనే ఉందని, మీరు లక్ష్యాన్ని ఏర్పరచుకొని అందుకు క్రమశిక్షణ, ప్రణాళిక బద్ధంగా కార్యచరణతో బాగా కష్టపడుతూ ఇష్టంగా చదివి సాధించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా విద్యార్థులకు బోధించారు. మంగళవారం మేడ్చల్ మండలం కిష్టాపూర్లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ మీ కలలను నిజం చేసుకొని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవడానికి మీరు బాగా కష్టపడి చదవాలని, అందుకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. వారి సబ్జెక్టుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకొని, వారికి అవసరమైన మార్గనిర్దేశ సూచనలు తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీలో మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగారు, విద్యార్థులు స్పందిస్తూ కంప్యూటర్లు, ల్యాబ్ కావాలని తెలుపగా, అదనపు కలెక్టరు తప్పకుండా సమకూరుస్తామని తెలిపారు. స్కూల్, కాలేజీ మొత్తం ఎంత మంది విద్యార్థులున్నారని, అన్ని సౌకర్యాలు ఉన్నాయా ఏమైనా మరమ్మత్తులు అవసరమా అని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, స్నాక్స్ అందిస్తూన్నారా అని అదనపు కలెక్టరు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, ప్రిన్సిపల్, తదితరులు పాల్గొన్నారు.



## కమ్యూనిటీ హాల్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ

**జయభేరి, కాప్రా :**

హెచ్ బి కాలనీ కమ్యూనిటీ హాల్ ను హౌసింగ్ బోర్డు డిపార్ట్మెంట్ వారు వేలం వేయుటకు నిర్ణయం తీసుకొని ముందస్తు జాగ్రత్తగా కాలనీల సంక్షేమ సంఘాలకు కెవిఎట్ పిటిషన్ వేసి నోటీసులు ఇవ్వడం జరిగిందని, ఈ కమ్యూనిటీ హాల్ వేలం ప్రక్రియని నిలుపుదల చేసి, ఈ కమ్యూనిటీ హాల్ ని కాపాడి జీహెచ్ఎంసీ కి అప్పగించి స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రోడ్డుభవనాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసిన కాలనీల సంక్షేమ సంఘ ప్రతినిధులు.

మంగళవారం రోడ్డుభవనాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాసరెడ్డితో కలిసి వినతి పత్రం అందజేసిన హెచ్ బీ కాలనీ ఫేజ్ 1 అండ్ ఫేజ్ 2 కాలనీల సంక్షేమ సంఘ ప్రతినిధులు. హెచ్ బి కాలనీ కమ్యూనిటీ హాల్ ను హౌసింగ్ బోర్డు డిపార్ట్మెంట్ వారు వేలం వేయుటకు నిర్ణయం తీసుకొని ముందస్తు జాగ్రత్తగా కాలనీల సంక్షేమ సంఘాలకు కెవిఎట్ పిటిషన్ వేసి నోటీసులు ఇవ్వడం జరిగిందని, ఈ కమ్యూనిటీ హాల్ వేలం ప్రక్రియని నిలుపుదల చేసి, ఈ కమ్యూనిటీ హాల్ ని కాపాడి జీహెచ్ఎంసీకి అప్పగించి స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరడం జరిగింది. హౌసింగ్ బోర్డ్ డిపార్ట్మెంట్ వారు అట్టి కమ్యూనిటీ హాల్ ను అమ్మడానికి నిర్ణయించి ముందు జాగ్రత్తగా మా పై కెవిఎట్ పిటిషన్ ఫైల్ చేసి, స్థానిక కాలనీల సంక్షేమ సంఘాలకు నోటీసులు ఇవ్వడం జరిగింది. కావున మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవ తీసుకొని ఈ కమ్యూనిటీ హాల్ వేలం ప్రక్రియని నిలుపుదల చేసి, ఈ కమ్యూనిటీ హాల్ ని కాపాడవలసిందిగా కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాసరెడ్డితో కలిసి తెలపడం జరిగింది. ఈ విషయంపై మంత్రి మాట్లాడుతూ.. సానుకూలంగా స్పందించి ఈ సమస్యపై సమగ్ర పరిశీలన చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫేజ్ 2 అధ్యక్షులు వెంకటాచారి, ఫేజ్ 1అధ్యక్షులు శివరాంప్రసాద్, గోవిందరెడ్డి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలి

**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 12 :**



ఆగస్టు 15న ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దాసరి మల్లేశం అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా మండల కన్వీనర్ మోత్కుపల్లి బిక్షపతి, కో కన్వీనర్ గుగులోతు మోహన్ నాయక్, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు .ఈ సందర్భంగా దాసరి మల్లేశం మాట్లాడుతూ 79 వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా భారతదేశ శక్తిని తెలియజేసిన సైనికుల త్యాగానికి ప్రతీకగా నిలిచిన ఆపరేషన్ సింధూర యొక్క విజయానికి గుర్తుగా ప్రతి ఒక్కరూ తమ తమ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తమ దేశభక్తిని చాటుకోవాలని అన్నారు. స్వతంత్రం రాకముందు భారతదేశం బ్రిటిష్ వారి పాలనలో బందీగా ఉంది అలాంటి భారతమాత ధాన్య సుంకలాలను చేదించడానికి స్వతంత్ర సమరయోధులు తమ మానప్రాణాలు త్యాగం చేయడం వలన భారతదేశానికి స్వతంత్రం సిద్ధించిందని అన్నారు. 1947 ఆగస్టు 14వ తేదీన విభజన చేయడం వలన పాకిస్తాన్లోని లాహోర్ పట్టణంలో ఉన్న హిందువులను తలలు నరికి ఆడవారి మానప్రాణాలను పసిపిల్లలను కూడా ఊచకోత కోసి రైల్లో వేసి భారత్కు పంపించడం జరిగిందని అన్నారు. ఆనాడు విభజన గాయాన్ని స్మరిస్తూ ఇకనైనా దేశ ప్రజలు సంకటితమై దేశ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బానోతు శత్రు నాయక్. రాష్ట్ర గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి నరేందర్ నాయక్, జిల్లా కౌన్సిల్ మెంబర్ చాంద్ పాషా ,జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బొల్లు నరసింహ యాదవ్, గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బానోతు శంకర్ నాయక్, పెండెం నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శి బినారం కనకయ్య, ఉపాధ్యక్షుడు తాడికొండ నరసింహులు, ఆకుల భాస్కర్ ఆకుల, శీను ,మండల అధికార ప్రతినిధి కందుకూరి వేణు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు చిలుకూరి రమేష్, అశోక్ కుమార్, శ్రీకాంత్ నాయక్,బినారం నర్సింలు, మేకల గణేష్, గాదె కృష్ణ, పాల్గొన్నారు.

## నూకల పద్మ రెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నిక




**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ నగరక సంస్థలోని సంగం హోటల్ నందు నిర్వహించిన తెలంగాణ రెడ్డి ఉమెన్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మేయర్ అమర్ సింగ్. పీర్జాదిగూడలో తెలంగాణ రెడ్డి ఉమెన్స్ అసోసియేషన్ సమావేశం సంఘం హోటల్ జరిగింది. నూకల పద్మ రెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు.

శ్రీలత రవీందర్ రెడ్డి కూడా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మహిళా అధ్యక్ష పదవికి ఎన్నికయ్యారు. ముఖ్య అతిథులుగా పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్ ఇద్దరినీ అభినందించారు. ఇద్దరూ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీధర్ రెడ్డి లక్ష్మీ ప్రసన్న, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వంగేటి ప్రభాకర్ రెడ్డి, మేడిపల్లి శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థాన డైరెక్టర్ తావిటి ప్రశాంత్, బీజేపీ నాయకులు ఏనుగు సుదర్శన్ రెడ్డి, కాలనీ వాసులు నవీన్ సాగర్, కపిల్ దేవ్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



నాచారం సరస్వతీ నగర్ కాలనీలో ఉన్న పార్క్ స్థలం ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉండె ఈ పార్కు అభివృద్ధి కొరకు సుమారు 4 సంవత్సరాల క్రితం రూ. 16 లక్షల మంజూరు చేయించడం జరిగింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఎంతకీ పనులు ప్రారంభించకపోవడంతో చివరకు మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోవడం జరిగింది. ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి సహకారంతో డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ తిరిగి రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించడం జరిగింది. పార్క్ అభివృద్ధి పనులను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శ్రీమతి శాంతి సాయిజెన్ శేఖర్ తో కలిసి ప్రారంభించడం జరిగింది. MLA అధికారులతో మాట్లాడుతూ.. ఏలాంటి ఆలస్యం లేకుండా తొందరగా పనులు పూర్తి చేసి కాలనీ వాసులకు పార్కును అందుబాటులోకి తీసుకురావాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో DE బాలకృష్ణ, AE వినీత్, వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, సరస్వతీ నగర్, బాపూజీ నగర్ కాలనీవాసులు, డివిజన్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


**జయభేరి, ఉప్పల్**



## ఏపీలో వార్ 2, కూలీ మూవీ టికెట్ రేట్లు పెంపు..

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా రెండు భారీ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఆగస్ట్ 14న బాక్సాఫీస్ దగ్గర వార్2 , కూలీ చిత్రాలు పోటీ పడేందుకు సిద్ధం కాగా, ఈ రెండు చిత్రాలలో ఏ చిత్రం ప్రభంజనం సృష్టిస్తుందా అని ప్రతి ఒక్కరు ఆసక్తిగా గమనిస్తున్నారు. గత కొద్ది రోజులుగా ఈ మూవీ టిక్కెట్ రేట్ల విషయంలో ఆసక్తికర చర్చ నడుస్తుంది. చెన్నైలో ధరలు తక్కువగా ఉన్నాయని , హైదరాబాద్‌లో మాత్రం భారీగా పెంచారంటూ కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హృతిక్ రోషన్ - ఎన్టీఆర్ కలయికలో రూపొందిన వార్ 2, రజనీకాంత్ నటించిన కూలీ సినిమాల టికెట్ల ధరలను పెంచుకోవడానికి మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాలీవుడ్ యాక్షన్ థ్రిల్లర్ 'వార్ 2' సినిమాకు భారీ అంచనాలు నెలకొన్నాయి. దేశవ్యాప్తంగా ఈ సినిమాపై హైప్ నెలకొని ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లోనూ సినిమాకు స్పెషల్ షోలు, అధిక ధరలకి టికెట్ల విక్రయం కోసం అవకాశం కల్పించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, రిలీజ్ రోజున ఉదయం 5 గంటలకు స్పెషల్ షో నిర్వహించుకోవచ్చని పేర్కొంది.ఈ షోకు టికెట్ ధరను రూ.500గా నిర్ణయించింది. మరోవైపు కూలీ సినిమాకు కూడా టికెట్ ధరల పెంపు విషయంలో అనుమతి లభించింది. ఆగస్ట్ 14 నుంచి 23వ తేదీ వరకు అంటే విడుదలైన మొదటి 10 రోజుల పాటు , కింది విధంగా టికెట్ ధరలు పెంచుకోవచ్చని తెలిపింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో అదనంగా రూ.75, మల్టీప్లెక్స్‌లలో అదనంగా రూ.100 , అలాగే బెనిఫిట్ షోలకు కూడా అనుమతి ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉదయం 45 గంటలకు జరిగే ప్రీమియర్ షోలకు కూడా అనుమతి ఇచ్చారు. వార్2, కూలీ చిత్రాలకి సంబంధించిన అన్ని ధరల మార్గదర్శకాలు ఒకేలా ఉంటాయని, ఒకే విధమైన టికెట్ ధర విధానం అనుసరించబడుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇక ఈ రెండు చిత్రాలకి సంబంధించి జోరుగా ప్రమోషన్స్ జరుగుతున్నాయి. రీసెంట్‌గా వార్ 2 ఈవెంట్ హైదరాబాద్‌లో అట్టహాసంగా జరిగింది.దీంతో మూవీపై అంచనాలు భారీగా నెలకొన్నాయి. మరోవైపు కూలీకి సంబంధించి తెలుగులో నాగ్ ఎక్కువగా ప్రమోషన్స్ చేస్తున్నట్టు కనిపిస్తుంది.

## పెళ్లి కూతురిలా లావణ్య త్రిపాఠి..



చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తుంది టాలీవుడ్ భామ లావణ్య త్రిపాఠి. ఈ భామ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం సతీలీలావతి. తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్.. టీజర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. తాజాగా మేకర్స్ చిత్తూరు పిల్ల లిరికల్ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు.

లావణ్య త్రిపాఠి పెళ్లి కూతురిలా మారిపోయి పాడుకుంటున్న ఈ పాట సినిమాపై మూవీ లవర్స్‌లో ఆసక్తిని పెంచుతోంది. వనమాలి రాసిన ఈ పాటను మిక్కీ జే మేయర్ కంపోజిషన్‌లో నూతన మోహన్, కృష్ణ తేజస్వి, రితేశ్ జీ రావు పాడారు. లావణ్య త్రిపాఠి ఈ పాటలో సూపర్ గ్లామరస్‌గా కనిపిస్తూ అభిమానులు, ఫాలోవర్లను ఖుషీ చేస్తోంది. సతీలీలావతి చిత్రాన్ని దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ బ్యానర్లపై నాగమోహన్ బాబు ఎం, రాజేష్ టి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నాడు.



## చూసి షాక్ అవుతున్న నెటిజన్స్..

ఒకప్పుడు శృంగార తారగా యువతకి బాగా పరిచయం ఉన్న సన్నీ లియోన్, ఇప్పుడు బాలీవుడ్‌లో ఓ ప్రముఖ నటిగా, డ్యాన్సర్‌గా తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. సన్నీ లియోన్ అసలు పేరు కరణ్ జిత్ కౌర్ కాగా ఇండస్ట్రీలోకి వచ్చాక సన్నీ లియోన్‌గా మార్చుకుంది. భారత మూలాలు ఉన్న సన్నీ లియోన్.. 2012లో 'జిస్మ్ 2' చిత్రంతో బాలీవుడ్‌లో అరంగేట్రం చేసింది. మొదట అనుకున్న స్థాయిలో సక్సెస్ అందుకోలేకపోయింది. అనంతరం 2013లో నటించిన 'జాక్‌పాట్' కూడా నిరాశపరిచింది. కానీ 2014లో వచ్చిన 'రాగిణి MMS 2' హర్రర్ చిత్రంతో బాక్సాఫీస్ విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయం ఆమెకు కొంత గుర్తింపు తీసుకొచ్చినా, నటిగా స్థిరపడేందుకు చాలా కష్టపడాల్సి వచ్చింది. ఈ సమయంలో సన్నీ ఐటెం సాంగ్స్ చేయడం ప్రారంభించింది. ఆమె చేసిన కొన్ని పాటలు యువతను బాగా ఆకర్షించాయి. తన 12 ఏళ్ల సినీ కెరీర్‌లో సన్నీ దాదాపు 40 సినిమాల్లో నటించిందైనా, చాలా చిత్రాల్లో ఆమె పాత్రలు పరిమితమైనవే. అడల్ట్ చిత్రాల్లో తనతో కలిసి నటించిన డేనియల్ వెబర్‌ను సన్నీ 2011లో పెళ్లాడింది. దశాబ్దకాలంగా తమ వైవాహిక జీవితం కొనసాగిస్తున్న ఈ జంటకి ముగ్గురు పిల్లలు నిషా, నోహ్, ఆషెర్ ఉన్నారు. నిషాను ఈ దంపతులు దత్తత తీసుకున్నారు. నటిగా కాకుండా, డ్యాన్సర్‌గా కూడా మంచి డిమాండ్ ఉన్న సన్నీ, ఒక్కో ఐటెం సాంగ్‌కి రూ. 3 కోట్లు వరకు తీసుకుంటుందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఆమె దక్షిణాది సినిమాల్లో కూడా కొన్ని ప్రాజెక్టుల్లో నటించింది.



ఆగస్ట్ 12న 39వ పుట్టినరోజు జరుపుకుంది. జాక్వెలిన్ తండ్రి శ్రీలంకకు చెందినవారు. తల్లి మలేషియా. ఆమె బహ్రెయిన్‌లోని మనామాలో జన్మించారు. చిన్నప్పటి నుంచే విభిన్న సంస్కృతి, సంప్రదాయల మధ్య పెరిగింది. సిడ్నీ విశ్వవిద్యాలయం నుండి మాస్ కమ్యూనికేషన్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి శ్రీలంకకు తిరిగి వచ్చింది. అక్కడ ఆమె టెలివిజన్ రిపోర్టర్‌గా, లంక బిజినెస్ రిపోర్ట్ షోకు యాంకర్‌గా పనిచేసింది. 2006లో లాస్ ఏంజిల్స్‌లో జరిగిన మిస్ యూనివర్స్ పోటీలో తన దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ మిస్ యూనివర్స్ శ్రీలంక కిరీటాన్ని గెలుచుకుంది. ఆ తర్వాత 2009లో సుజోయ్ ఘోష్ దర్శకత్వంలో వచ్చిన అలాడిన్ అనే ఫాంటసీ డ్రామాతో బాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. ఫస్ట్ మూవీతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. దీంతో ఆమె ఐఫా స్టార్ డెబ్యూ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకుంది. 2011లో వచ్చిన సైకలాజికల్ థ్రిల్లర్ మర్డర్ 2 మూవీతో ఆమె కెరీర్ ఒక్కసారిగా మారిపోయింది. హౌస్‌ఫుల్ 2 (2012), రేస్ 2 (2013), మరియు కిక్ (2014) వంటి చిత్రాలతో హిట్లు అందుకుంది. జాక్వెలిన్ ఎక్కువగా స్పెషల్ పాటలతో ఫేమస్ అయ్యింది. అలాగే శ్రీలంకలో సొంతంగా ద్వీపం కొనుగోలు చేసిందట. జాక్వెలిన్ చివరిగా తరుణ్ మన్సుఖాని దర్శకత్వం వహించిన మల్టీస్టారర్ చిత్రం హౌస్‌ఫుల్ 5 లో కనిపించింది.

## అమ్మడు చూస్తే మతిపోవాల్సిందే..

## కాంతార టీమ్‌లో వరుస మరణాలు.. ఎట్టకేలకి స్పందించిన నిర్మాత





కన్నడలో విడుదలై సూపర్ హిట్ సాధించిన కాంతార చిత్రం ఆ తర్వాత దేశ వ్యాప్తంగా విడుదలై మంచి ఆదరణ దక్కించుకుంది. ఇప్పుడు ఈ మూవీకి ప్రీక్వెల్‌గా కాంతార చాప్టర్ 1 రూపొందుతుంది. ఈ మూవీ చుట్టూ ఎన్నో రహస్యాలు,అపోహలు తిరుగుతున్నాయి. పౌరాణిక శక్తుల నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై దాగి ఉన్న శక్తులు అడ్డుపడుతున్నాయనే ప్రచారం జోరుగా నడుస్తోంది. ముఖ్యంగా చిత్రబృందంలోని కొందరి మరణాలు, సెట్స్‌లో జరుగుతున్న ప్రమాదాలు ఈ ప్రచారానికి బలం చేకూర్చాయి. ఇప్పటివరకు ఈ సినిమా టీమ్‌లో నలుగురు సభ్యులు మృతి చెందడంతో పాటు, ఇటీవల చిత్రంలో కనిపించిన దున్నపోతు కూడా మృతి చెందడం వల్ల ఈ విషయాలు మరింత చర్చనీయాంశంగా మారాయి.

మీడియా కూడా ఈ కథనాలను హైలైట్ చేస్తోంది.దీంతో, కాంతార టీమ్‌ను ఏదో దుష్ట శక్తి వెంటాడుతోందా? అనే సందేహాలు ప్రజల్లో రేకెత్తుతున్నాయి. అయితే ఇప్పటివరకు చిత్ర బృందం నుంచి దీనిపై ఎలాంటి అధికారిక స్పందన రాకపోవడంతో అపోహలు మరింత పెరిగాయి. ఎట్టకేలకి చిత్ర నిర్మాత చలువే గౌడ తాజాగా ఈ విషయంపై స్పందిస్తూ .. "మా సినిమాపై జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు. కొన్ని తప్పుడు కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. వాస్తవానికి, కొన్ని ప్రమాదాలు నిజమే అయినా, ఎవరికీ పెద్ద నష్టం జరగలేదు. 2025లో ఒకసారి సెట్లో అగ్నిప్రమాదం జరిగింది. కానీ అందరూ సురక్షితంగా బయటపడ్డారు. అదే సమయంలో, ఒక నదిలో పడవ మునిగిన ఘటనలో కెమెరాలు, పరికరాలు మాత్రమే నష్టపోయాయి. ప్రాణ నష్టం లేదు. దయచేసి అసత్యాలను ప్రచారం చేయొద్దు అని క్లారిటీ ఇచ్చారు.

అలాగే, సినిమా చిత్రీకరణకు ముందు పంజుర్లి అమ్మవారిని దర్శించుకున్నామని, ఆమె దివ్యదర్శనంలో కొన్ని అడ్డంకులు వచ్చినా, చిత్రీకరణ విజయవంతంగా పూర్తవుతుందని చెప్పారని అన్నారు.రోజూ తెల్లవారుఝామున 4గం.లకు లేచి, 6గం.లకు షూటింగ్ మొదలుపెట్టేవాళ్లం. మధ్యలో విమర్శలు ఎదురైనా, ఇప్పుడు ఫుటేజ్ చూసి చాలా సంతృప్తిగా ఉంది అని కూడా వెల్లడించారు. ఈ మూవీని అక్టోబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ప్లాన్ చేస్తున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314.** email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com